# స్వచ్ఛ కరీంనగర్ కల సాకారం చేద్దాం : ఎంపీ వినోద్




**బాలవికాస్ సంస్థకు చెక్ అందజేస్తున్న దృశ్యం**

**భాగ్యనగర్, న్యూస్‌టుడే :** అందరి సహకారంతో స్వచ్ఛ కరీంనగర్ కల సాకారం చేసేందుకు కృషి చేయాలని ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రతిమ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. స్వచ్ఛ కరీంనగర్‌కు చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న చోళమండలం పెట్టుబడులు, ఆర్థిక సంస్థ సౌజన్యంతో బాల వికాస సంస్థలు జిల్లాలో గ్రామాలను తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. చోళమండలం సంస్థ ఈ కార్యక్రమానికి రూ. 97 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. దీంతో కరీంనగర్ బస్టాండ్‌లో ఈ-టాయిలెట్స్, ఒక రూపాయికే స్వచ్ఛనీరు అందించే కార్యక్రమాలు చేపడుతారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వంద శాతం మరుగుదొడ్ల ఏర్పాటు చేసేందుకు ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని చెప్పారు. బాల వికాస సంస్థ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బెజ్జంకి క్రాస్ రోడ్డు, గుగ్గిళ్ల, వింజపల్లి గ్రామాల్లో మరుగుదొడ్డి లేని 250 కుటుంబాలకు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.. కోహెడ పాఠశాలలో బోరు మోటారు, టాయిలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని వందశాతం మరుగుదొడ్లు కట్టిస్తామని తెలిపారు. జులై నాటికి ఈ కార్యక్రమాలు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, మేయర్ రవీందర్ సింగ్, బెజ్జంకి జడ్పీటీసీ తన్నీరు శరత్ రావు, చోళమండల కంపెనీ ప్రతినిధి కన్నన్, మహ్మద్ మావియా, హేమంత్‌కుమార్ పామర్తి, లత, మంజుల, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.